# కొత్తవెలుగు



## కాకాని కమల

రామకృష్ణయ్య ఇంటికి వచ్చేసరికి భార్య సావిత్రమ్మ కళ్లమ్మట నీళ్లు పెట్టుకుంటూ కూర్చుంది.

రామకృష్ణయ్య కనుబొమ్మలు ముడిపడ్డాయి.

గభాల్న చేతిలోని మందుల ప్యాకెట్లు ప్రక్కనే ఉన్న బల్లమీద పెట్టాడు.

"అలా వున్నావేం సావిత్రి? ఏమైంది?" అన్నాడు గాభరాగా. సావిత్రమ్మ ఎర్రబడ్డ కళ్లతో మరుక్షణ భర్తకేసి చూసి తల తిప్పుకుంది.

బొట బొటా కారుతున్న కన్నీటిని పయిట చెంగుతో తుడుచుకుంటూ

"ఇంకా ఏం కావాలి? మీ మూర్ఖత్వానికి అమ్మాయి సంసారం బలి అవుతూంది. అల్లుడు విడాకుల నోటీసు పంపాడు. అంటూ విసురుగా లేచి అల్మారాలోంచి రిజిస్టరీ కవరు తీసి భర్త ముందు పడేసింది.

సాలోచనగా రామకృష్ణయ్య నొసలు ముడుచుకుంది.

అ...లా...గా అంటూ జేబులోంచి కళ్లజోడు తీసి పెట్టుకుంటూ కవరు అందుకున్నాడు.

భార్య లలిత పేర్న లాయర్ ద్వారా అల్లుడు సుదర్శనం పంపిన విడాకుల నోటీసు అది.

దాంతో పాటే మావగారి పేర్న ఒక చిన్న ఉత్తరం అది ఉత్తరమా?

కాదు.

రెండు జీవితాల్ని విడదీసే విడాకుల పత్తరం!

రామకృష్ణయ్య గారికి.

మీ అమ్మాయి లలితకి నాతో వివాహం జరిగి రెండు సంవత్సరాలు అవుతుంది. కాని

అత్తింట కంటే ఆమె పుట్టింటే ఎక్కువ రోజులు వుండిపోతుంది. కారణం మీ అమ్మాయి ప్రవర్తన మంచిది కాకపోవటమే. పెళ్లికి ముందే చాలామంది వ్యక్తులతో చాటు మాటు వ్యవహారాలు నడిపిన ఆడది సంసారపక్షంగా...
సరే.. ఆ విషయాలు ఇక్కడ అప్రస్తుతం.

కాని ఏడాదిలో ఎనిమిది నెల్లు పుట్టింట, నాలుగునెల్లు అత్తింట ఉండే ఆడదాన్ని కట్టుకున్న ఏ మగవాడు సుఖపడలేడన్నది నిర్వివాదాంశం.

అంతేగాదు, నీతిమాలిన ఆడదానితో సవ్యంగా కాపురం సాగటం కూడా అసాధ్యమే.

అందుకే నేను లలితకి విడాకులు ఇచ్చి వేరే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను.

మీరు ఇంకేమైనా మాట్లాడదల్చుకుంటే కోర్టు దగ్గరే కల్సుకోగలరు.

ఇట్లు
సుదర్శనం

ఆ ఉత్తరంతో పాటే ఉన్న మరో కవర్ ని కూడా బయటికి తీశాడు రామకృష్ణయ్య.

యధాలాపంగా కవరు విప్పిన రామకృష్ణయ్య కార్డు సైజులో రంగుల్తో ఉన్న ఆ గ్లేసి ప్రింటు ఫోటోల కేసి చూస్తూనే శివ శివా అంటూ కళ్లు మూసుకున్నాడు.

ఒంటిమీద గొంగళి పురుగులు పాకినట్లు రామకృష్ణ మేను జలదరించింది.

కూతురు లలిత పక్కన ఎవరెవరో అపరిచిత యువకులు అసభ్యకరమైన భంగిమల్లో వుండగా చాలా భాగం న్యూడ్ యాంగిల్స్ లో తీసిన ఫోటోలు అవి.

కొంతమంది సినిమా తారల్ని శృంగార భంగిమల్లో చిత్రంలో బ్లూ ఫిల్మంలాగ చూపిస్తూ ఉంటారు.

నిజానికి ఆ తార ఆ ఫిల్ములో నటించకపోవచ్చు.
కానీ

ట్రిక్ ఫోటోగ్రఫీ ద్వారా అలా చూపించడం సాధ్యపడుతుంది. చెట్టు పేరుచెప్పి కాయలమ్ముకున్నట్లు ఆవిధంగా సొమ్ము చేసుకుంటుంటారు.

ఇక్కడ తన కూతురు లలిత విషయంలోనూ అంతే జరిగింది అనుకున్నాడు బాధగా రామకృష్ణ.

మచ్చలేని మల్లెమొగ్గలాంటి లలిత ప్రవర్తన ఎటువంటిదో రామకృష్ణకి తెలియంది కాదు.

కాని అల్లుడి నీచబుద్ధికి అసహ్యం అనిపించింది.

డబ్బుకోసం మనుషులు ఎంత నీచానికి

## వణుకు

'మీ ఆవిడ నిన్ను చూసి వణుకుతుందని చెప్పావు బడాయి. నిన్న మీ ఆవిడను చూసి నువ్వే అలా వణికి పోయావేమిట్రా! నేను చూళ్లేదనుకున్నావా! కిటికీలోంచి చూశా!' చెప్పాడు నీలగిరి.

'మా ఆవిడ చేతిలో ఏదైనా ఉంటే మాత్రం వణుకుతాను. ఆ విషయం నీకు చెప్పడం మర్చిపోయా!' సమర్థించుకున్నాడు శ్వేతగిరి. — రాయవరపు రవి

ఒడిగడతారో.. స్వంత భార్య విషయంలో నయినా సరే ఎంతగా దిగజారుతారో తల్చుకుంటే రామకృష్ణయ్య కడుపులో భగ్గున మండినట్లయింది.

ఆవేశంగా చేతిలోని ఆ ఫోటోలని కసిగా చింపి కిటికీలోంచి చెయ్యి చాపి మురుగు కాలువలో పడేలా విసిరాడు.

ఈ విషయంలో కోర్టుకి వెడితే లలితకి న్యాయం జరుగుతుంది. కారణం బలమైన సాక్ష్యాధారాలు తన దగ్గర ఉన్నాయి. అల్లుడు సుదర్శనం నీచ ప్రవృత్తిని నిరూపించటానికి కావల్సినంత ఎవిడెన్స్ ఉంది.

అవన్నీ పరిశీలించి కోర్టు ఆ ఇద్దర్నీ కల్సి బ్రతకమని నిర్దేశించవచ్చు.

కానీ..

కప్ప పాము ఒక కంతలో కల్సి బ్రతగ్గలవా?

పాములాంటి విషబుద్ధి గల తన అల్లుడి నీచ ప్రవృతికి తన కూతురు బలికాకుండా ఉంటుందా?

ఆ భావంతోనేకదూ లలిత ఏడాదిలో ఎనిమిది నెల్లు పుట్టింట్లోనే పడి వుంటుంది?

రామకృష్ణయ్య భారంగా తల పట్టుకున్నాడు.

సావిత్రీ! కొంచెం వేడిగా కాఫీ తెచ్చి పెట్టగలవా? అన్నాడు అలసటగా పడక కుర్చీలో వాలి కళ్లు మూసుకుంటూ.

సావిత్రమ్మ సణుక్కుంటూలేచి వంట గదిలోకి వెళ్లింది.

ఈ మధ్య రామకృష్ణయ్య ఆరోగ్యం దెబ్బతింది. ఇది వరకులా సక్రమంగా ఉద్యోగానికి వెళ్లలేకపోతున్నాడు. తరచూ సెలవులు పెట్టవలసి వస్తుంది. ప్రస్తుతం నెల రోజులుగా మెడికల్ లీవులో ఉన్నాడు.

వాలంటరీ రిటైర్ మెంటు తీసుకుందామా అనుకుంటున్నాడు.

రామకృష్ణయ్యకి ముగ్గురు పిల్లలు.

ఇద్దరు కొడుకులు. ఒక కూతురు లలిత.

పెద్ద కొడుక్కి విశాఖ హార్బర్ లో ఉద్యోగం. ఇద్దరు పిల్లలు. అతని జీవితం సంసారం బాగానే ఉంది.

రెండవ వాడికి కూడా టెలికమ్యూనికేషన్స్ లో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం బెంగుళూరులో ట్రయినింగ్ పిరియడ్ లో ఉన్నాడు మేనరికం ఉంది.

ఇద్దరి మధ్యన ఆడపిల్ల లలిత.

డిగ్రీ పాసైంది.

రెండు సంవత్సరాల క్రితం పాతికవేలు కట్నం ఇచ్చి, పదితులాలు బంగారం పెట్టి శక్తికి మించి ఘనంగా పెళ్లి చేశాడు. ఒక్కర్తే కూతురని అన్ని అచ్చట్లూ ముచ్చట్లూ జరిపించారు.

అల్లుడిది బిజినెస్.

వెనక అంతో ఇంతో ఆస్థి అంతస్తూ ఉన్నవాడే. నల్గురాడపిల్లల మధ్యన ఒక్కడే కొడుకు. తన కూతురు సుఖపడుతుందని ఆశించాడు రామకృష్ణయ్య.

కాని లలితకి అత్తిల్లు నరకం అయ్యింది.

అత్తతో పాటు భర్త డబ్బు మనుషులు కావడంతో రోజురోజుకి ఆమె జీవితం దుర్భరం అయ్యింది.

అల్లుడు సుదర్శనం బిజినెస్ మాన్ అని తెల్సు.

కాని భార్యతోనే వ్యాపారం చేసి లాభనష్టాలు బేరీజు వేస్తాడనుకోలేదు.

నాలుగు నెల్లకోసారి వ్యాపారంలో పెట్టుబడికి అవసరం అయ్యిందంటే పది, పాతిక వేలు తెమ్మని లలితని పుట్టింటికి పంపేవాడు.

కూతురి సంసారం ఎక్కడ పాడవుతుందోనని చేతిలో లేకపోయినా అక్కడ ఇక్కడ వడ్డీలకి తెచ్చి, ఇంటి మీద అప్పు చేసి అల్లుడు అడిగి దాంట్లో సగమో వీలుని బట్టి పూర్తిగానో ఇచ్చి పంపేవాడు.

కాని అది అవసరం కాదని, అల్లుడి ఆనవాయితీ అని తెలియటానికి ఆట్టే కాలం పట్టలేదు.

పెళ్లయిన ఏణ్ణార్థంలో కట్నం కాక పైగా యాభైవేలు ముట్టచెప్పాడు రామకృష్ణయ్య.

అయినా సుదర్శనం ఆశ చావలేదు.

ఆఖరికి ఆరు నెల్లక్రితం మీ నాన్న వాలంటరి రిటైర్ మెంటు తీసుకుంటున్నాడు కదా ఉద్యోగంలో మిగిలే డబ్బులోనూ, ఇంటిలోనూ నీ మూడవ వంతు వాటా అడిగి తీసుకురా. అంతవరకూ గుమ్మం తొక్కవద్దని లలితని అత్తా, భర్తాపుట్టింటికి తరిమారు. నిస్సహాయురాలైన లలిత కన్నీటితో పుట్టిల్లు చేరింది.

ఆమె మూడు నెల్ల గర్భవతి.

అయినా అత్తింటివారు దయదలచలేదు.

కూతురి సంసారం రచ్చ కెక్కుతుందని

సావిత్రమ్మ ఏడుస్తుంది. రామకృష్ణయ్యకి ఎటూ పాలుపోవడంలేదు.

నిజానికి ఇంటి మీద బోల్డంత అప్పు ఉంది.

ఉద్యోగంలో మిగిలే దాంట్లో వడ్డీలకి తెచ్చిన వేబదుళ్లు ఉన్నాయి.

కూతురి పెళ్లికి చేసిన అప్పు తీరనే లేదు.

ఇవన్నీ పోను చేతికి వచ్చే.దాంట్లో పెద్దగా మిగిలేది ఏం లేదు.

అంతో ఇంతో మిగిలినా కొడుకులకి ఏదో తనవంతుగా వాటా ఇద్దామనుకుంటున్నాడు.

ఒకర్ని దేహి అనకుండా నెలనెలా వచ్చే పెన్షన్‌తో తను భార్య బ్రతకవచ్చు అని ఆలోచించాడు రామకృష్ణయ్య.

కాని కూతురి సంసారం బాగుపడేదెట్లా?

ఎక్కడో అక్కడ తాకట్టు పెట్టితెచ్చి అల్లుడ్ని తృప్తిపరిచినా అది తాత్కాలికమే.

పోనీ అలా అని వూరుకుందామన్నా కూతురిని ఎన్నాళ్లని పుట్టింట్లో ఉంచుకోవాలి?

అప్పుడే వచ్చి రెండునెల్లు దాటిపోయింది.

ఐదవనెల వచ్చింది. రేపు పుట్టబోయే బిడ్డకి తండ్రి కావద్దా?

లేకుంటే లోకం బ్రతకనిస్తుందా?

అప్పుల బాధలు అల్లుడికి చెప్పినా వినిపించుకోడు.

న్యాయంగా లలితకి రావాల్సిన మూడవ వంతు వాటా ఇచ్చి పంపమని, ఆ తరువాత తను చెట్టు నీడన బ్రతికిన ఫరవాలేదని, కూతురి సంసారం ముఖ్యం అని సావిత్రి పోరు పెడుతుంది తల్లి మనసు.

కాని ఎందుకో రామకృష్ణయ్యకి ఆ పద్ధతి సమంజసం అనిపించడంలేదు.

అల్లుడికి ఇంకా ఇవ్వడం అపాత్ర దానమే అవుతుంది. అతని నీడలో తన కూతురి జీవితం అగచాట్లు పాలుకాక తప్పదని రామకృష్ణయ్య అంతరాత్మ హెచ్చరిస్తుంది.

కాని ఈ విషయం కూతురికి ఎలా చెప్పగలడు?

చెప్పినా అర్థం చేసుకుంటుందో లేక.. నాన్న డబ్బు కోసం చూసుకుంటున్నాడు అనుకుంటుందో అని తర్జన భర్జన పడుతున్నాడు.. అసలు...

''ఇదిగో కాఫీ'' భార్య పిలుపుకి ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు రామకృష్ణయ్య.

వేడిగా పొగలు కక్కుతుంది కాఫీ.

కప్పు అందుకుంటూ భార్యకేసి తేరిపార చూశాడు రామకృష్ణయ్య.

ఆవిడ ఇంకా దుఃఖ పడుతున్నట్టుంది. కళ్ల చివర్ల నీటి చుక్కలు మెరుస్తున్నాయి.

''సావిత్రీ! ఇంకా ఏడుస్తున్నావా?'' అన్నాడు ఆవిడ చేతిని పట్టుకుంటూ.

సావిత్రమ్మ ముఖం తిప్పుకుంది.

వున్న ఒక్కగానొక్క కూతురి సంసారం కూలిపోతుంటే ఏడవక ఏం చెయ్యమంటారు?

రామకృష్ణయ్య చిన్నగా నిట్టూర్చాడు.

అయితే ఏం చెయ్యమంటావు? కాఫీ కప్పు నోటి దగ్గర పెట్టుకుంటూ అడిగాడు.

సావిత్రమ్మ పయిట చెంగుతో కళ్లు తుడుచుకుంది.

సావిత్రి! ముందు నువ్వు కుర్చో. స్తిమితంగా ఆలోచించి చెప్పు ఏం చేద్దామంటావో? అమ్మాయి కాపురం కూలిపోవడం నాకు మాత్రం ఇష్టమా?

ఆ మాట నేనన్నానా? అది నాకే కాదు మీకూ కూతురే?''

''మరి? నేనేదో దానికి అన్యాయం చేస్తున్నానంటావేమిటి? రామకృష్ణ గొంతులో ఆవేదన సుళ్లు తిరుగుతుంది.

సావిత్రమ్మ నచ్చ చెపుతున్నట్టు అంది.

అది కాదండి. అల్లుడు డబ్బు అడిగినప్పుడే ఏదో సర్దుబాటుచేస్తే సరిపోయేది. మీరు భీష్మించుకు కూర్చున్నారు. పరిస్థితి విడాకుల దాకా వచ్చింది.

నిజమే కానీ మళ్లీ అడగడని గ్యారంటీ ఏమిటి? ఇప్పటికి అతను ఇలా అడగడం మొదటిసారి కాదు. ఒప్పుకున్న కట్నం పాతికవేలు. అదనంగా యాభైవేలు ఇచ్చాం..''

నిజమే. కానీ ఏదో వ్యాపారం అంటున్నాడు కదా?''

అంత వ్యాపారానికి అవసరం అయితే ఎక్కడైనా అప్పు తెచ్చుకుని లాభాలు వచ్చినప్పుడు తీర్చుకోవాలి. లేదూ వ్యాపార విస్తరణ తగ్గించుకోవాలి. అంతేగాని మనల్ని అడగడం ఏమిటి? ఇలా ఎన్నాళ్లని ఇవ్వగలం? ఆలోచించావా?

సావిత్రమ్మ చిన్నగా నిట్టూర్చింది.

ఆలోచించక పోవడం ఏమిటి? ఆలోచించాను?

మరి నా మీద నింద మోపడంలో అర్థం ఏమిటి?''

సావిత్రమ్మ ముఖం దించుకుంది.

వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘంలా భార్య ముఖం చూడగానే జాలేసింది.


సరే! ఇప్పుడు ఏం చేద్దాం!''

ఏదో ఆధారంగా ఈ ఇల్లు ఉంది కదా? దాన్ని అమ్మేద్దాం.

అప్పు పోను ఓ యాభైవేలు చేతిలో మిగులుతుంది. ఆ డబ్బు అల్లుడి చేతిలో పెడదాం.

''సరే! బాగానే ఉంది. అల్లుడు అక్కడితో తృప్తిపడతాడా? మళ్లీ అడగడని గ్యారంటీ ఏమిటి?

కాళ్లుకడిగి పిల్లనిచ్చిన వాళ్లం. రెండు చేతులు జోడించి దణ్ణం పెడదాం. మన పరిస్థితి అల్లుడికి వియ్యపురాలికి వివరంగా చెప్పుకుందాం. ఆవిడ ఆడపిల్లలు గలదే. ఒకసారి కాకుంటే ఒకసారైనా ఆ మాత్రం ఆలోచించదంటారా? అల్లుడికి ఏదో చిన్నతనం. కాని ఇప్పుడు తండ్రి కాబోతున్నాడు. ఇంక ఇలాంటి చిన్న చేష్టలు చెయ్యకపోవచ్చు.



రామకృష్ణయ్య చిరునవ్వు నవ్వాడు.

నిజమే. నీ ఆలోచన బాగానే ఉంది. కాని ఇంట్లో అబ్బాయిలకి వాటా ఉంది ఏమంటారో.

ఆ విషయం నేను చూసుకుంటాను. అబ్బాయిలిద్దరూ బంగారు తండ్రులు. నా మీద దయదలచి చల్లగా చూస్తే వాళ్ల ఉద్యోగంలో ఇంతకంటే మంచి ఇళ్లు కట్టుకుంటారు. చెల్లాయి సంసారం బాగుండాలని వాళ్లకి మాత్రం వుండదూ? సావిత్రమ్మ ఆశగా భర్త ముఖంలోకి చూసింది.

రామకృష్ణయ్య కాఫీ గ్లాసు కింద పెట్టి రెండు చేతులు తలకింద పెట్టుకుని కుర్చీలో వెనక్కి వాలాడు.

సరే! పోనీ ఆఖరి ప్రయత్నంగా అలాగే చేద్దాం. మన లలిత ... చిట్టి తల్లి సంసారం బాగుపడటం కంటే నాకు మాత్రం ఏం కావాలి?''' అన్నాడు.

ఆమాటతో సావిత్రమ్మ ముఖం చింకి చాటంత అయ్యింది.

గబగబా లేచి సొరుగులోంచి ఇన్‌ల్యాండ్ కవరు, కలం తెచ్చి భర్తకి అందించింది.

ఆ మాట అల్లుడికి వెంటనే వ్రాయండి. డబ్బు సర్దుబాటు చేస్తున్నాను. నీ వాటా నీకు అణా పైసల్తో సదా అందుతుంది. ఇంటి గొడవ రచ్చకెక్కటం మంచిది కాదు అని నచ్చ చెపుతూ రాయండి.

సరే అన్నాడు.

భార్య ముఖంలో మతాబులా వెలిగిపోతున్న ఆనందం చూస్తుంటే రామకృష్ణయ్యకి తమాషాగా వుంది.

కాని ఆ మతాబు ఎంతసేపు అలా నిలిచివెలుగుతుంది. అన్నట్టు మన మెరకవీధిలోని విశ్వనాథంగారు లేరూ! ఆయన కూడా రిటైర్ అవుతున్నాడుకదా ఈ ప్రాంతంలో ఎక్కడైనా ఇళ్లు అమ్మకానికి వుంటే చెప్పమని, వాళ్లకి కొనుక్కునే ఉద్దేశ్యం ఉందని విశ్వనాథంగారి భార్య శకుంతలమ్మ ఆ మధ్య నాతో అంది. ఎవరో ఎందుకు వదినా మాకే ఆ పరిస్థితి వచ్చేట్టు ఉంది. అన్నాను మాట వరసగా. ఒకవేళ అలాంటిదేమన్నా ఉంటే ఆవిడకి చెప్పకుండా వేరే ఎవరికి మాట ఇవ్వద్దంది''

"అలాగా?"

"అవును. అందుకని ఇప్పుడే వెళ్లి ఆవిడకి ఈ విషయం చెప్పివస్తాను. ఒకవేళ వాళ్లు ఇళ్లు కొనుక్కుంటామని అడ్వాన్సుగా వెంటనే కొంత ఇస్తారు. దాంతోముందే అల్లుడ్ని సమాధానపరచవచ్చు. ఏమంటారు?" అంది సావిత్రమ్మ.

"బాగానే ఉంది"అన్నాడు రామకృష్ణయ్య.

"సరే ఈలోగా మీరు ఉత్తరం వ్రాయండి. నే వెళ్లి కనుక్కుని వస్తాను. తొందరగా వస్తానులెండి"అంటూ సావిత్రమ్మ లేచి విశ్వనాథం గారింటికి బయలుదేరింది

వీధిగేటు తెరిచి రోడ్డుదాటి మెరక వీధి వైపువేగంగా అడుగులు వేసుకు వెళ్తున్న భార్యని చూస్తూ ఆలోచనలో పడ్డాడు రామకృష్ణయ్య.

చేతిలో కలం కాగితం ఉన్నాయి.

కాని అల్లుడికి ఏం రాయాలన్నా అదీ మరీ ప్రాధేయపడుతూ రాయాలంటే ఇంకా అవమానంగా అనిపిస్తుంది.

పెన్ను నుదుటికి ఆన్చుకుని ఆలోచనగా కళ్లు మూసుకున్నాడు రామకృష్ణయ్య.

ఇంతలో..

గ[illegible] దగ్గర గల గలా గాజులు శబ్దం అయ్యింది.

ఆ శబ్దంతోపాటే నాన్నా అన్న చిన్న పిలుపు.

రామకృష్ణయ్య కళ్లు తెరిచాడు.

ఎదురుగా.

కూతురు లలిత.

జోరున వాన కురిసి వెలిసిన ఆకాశంలా వుంది ఆమె వదనం.

కళ్ల చివర్న ఎర్రగా మెరుస్తున్నాయి.

ఒడిలిన పువ్వులా ఉన్న ఆమెని చూడగానే రామకృష్ణయ్య హృదయం బాధగా మూల్గింది.

''ఏ... ఏమిటి తల్లీ?'' అన్నాడు.

''నాన్నా! మీరు మరోలా అనుకోనంటే ఒక చిన్న విషయం..''

"చెప్పు తల్లీ!"

"నువ్వూ అమ్మా మాట్లాడుకున్నదంతా విన్నాను నాన్నా! అమ్మ పూర్వకాలంది. ఆవిడ పెద్దగా చదువుకోలేదు. ఇప్పటి కాలానికి తగినట్లు ఆలోచించలేదు. ఆవిడకి నా మనసు విప్పి చెప్పినా అర్థం చేసుకోలేదు. అందుకే నేను.."

రామకృష్ణయ్య మృదువుగా మందహాసం చేశాడు.


"ఫరవాలేదు తల్లీ.. అత్తింట అగచాట్లు పడుతున్నదానివి నువ్వు. నీ భర్త అత్తల గురించి నాకంటే నీకే బాగా తెలుసు. కాబట్టి నీ ఇష్టాన్ని నిర్ణయాన్నినేను గౌరవిస్తాను తల్లీ"

లలిత కళ్లల్లో ఒక చిన్న వెలుగు మెరిసి మాయం అయ్యింది. థాంక్స్ నాన్నా! మీ అల్లుడు మనిషి రూపంలో ఉన్న రాక్షసుడు నాన్నా. ఎంత డబ్బు ఇచ్చినా వాడి దాహం తీరదు. ఒక స్త్రీగా నీ భర్త విషయంలో చెప్పుకోలేని విషయాలు చాలా ఉన్నాయి. అవన్నీ అప్రస్తుతం. కాని.. నేను ఇంక ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడికి వెళ్లాలనుకోవడం లేదు నాన్నా!"

"ల..మ్మా..ల..లి..తా?" రామకృష్ణయ్య విభ్రాంతిగా చూశాడు.

''అవును నాన్నా! ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నా నిర్ణయం మారదు. నన్ను అర్థం చేసుకుని మీరు చేయూతనిచ్చారా సరే. లేదంటే నేను మీకు దూరంగా వెళ్లిపోతాను.

నాకు నచ్చిన విధంగా నా జీవితాన్ని మలుచుకుంటాను. ఒక్కరికి భారం కాకుండా నా బతుకు నేను బతుకుతాను. నాన్నా! అనవసరంగా మీరు అమ్మమాట పట్టుకుని ఈ ఇల్లు



అమ్మకండి. మీ అల్లుడికి చిల్లిగవ్వ కూడా పంప నవసరంలేదు. మీరు నా మాట కాదని పంపినా నేను మాత్రం ఇంక ఆ గడప తొక్కబోవడంలేదు. అవసరం అయితే గొంతుక్కి వురి పెట్టుకుంటానుగాని.. ఆ ఇంటికి మాత్రం..'' లలిత గొంతు దుఃఖంతో పూడుకుని పోయింది.

చప్పున తల దించుకుని పయిట చెంగు ముఖానికి అడ్డం చేసుకుంది.

రామకృష్ణయ్య గభాల్న కుర్చీలోంచి లేచి కూతురి భుజాలు పట్టుకున్నాడు.

ఆమె తలమీద చెయ్యివేసి నిమిరుతూ ఓదారుస్తున్నట్లు అన్నాడు.

"వద్దు తల్లీ. ఏడవకు. మేతవేసిన చెత్తోనే మెడ నరికేంతటి కసాయివాణ్ణి కాదు నేను. అల్లుడి ప్రవర్తన, బుద్ధి చూశాక ఇక నిన్ను ఆ ఇంటికి పంపటం అవివేకం అని నాకే అనిపిస్తుంది. కాని.. మీ అమ్మ.. ముఖ్యంగా నీ మనసేమిటో తెలియక తర్జన భర్జన పడుతున్నానా.. నాన్న డబ్బుకి ముఖం చూసుకుంటున్నాడు అనుకుంటావేమోనని భయపడుతున్నాను తల్లీ.."

లలిత చివ్వున తల ఎత్తింది.

నేను అలా అనుకోను నాన్నా అన్నట్లు తల అటు ఇటూ తిప్పింది.

చప్పున తండ్రి రెండు చేతులు పట్టుకుని బ్రతిమాలుతున్నట్లు అంది.

"నాన్నా! ఈ విషయంలో అమ్మకి నువ్వే నచ్చ చెప్పాలి. అంతేకాదు నాన్నా! నాకు ఎక్కడైనా ఒక చిన్న ఆధారం చూపించే బాధ్యత మాత్రం నీదే. మీరు నాకు తిండిపెట్టలేరని కాదు. నా కాళ్లమీద నేను నిలబడితే నాకు కొంచెం ధైర్యం ఆత్మవిశ్వాసం వస్తాయి నాన్న!

### ఆగని కథ!

''మీరు పదేళ్ళ నుంచి రాస్తున్న 'ఆగనికథ' అనే నవలను ఎప్పుడు పూర్తిచేస్తారు'' అడిగాడు పాఠకుడు.

''దాన్ని పూర్తిచేయను!'' చెప్పాడురచయిత.

''ఎందుకు?''

''అది 'ఆగనికథ' కదా!'' అని చెప్పాడు రచయిత.

రాయవరపురవి, రామాయంపేట.

ప్లీజ్.."

రామకృష్ణయ్య చిరునవ్వు నవ్వాడు

లలిత చెంపలమీద జారిపోతున్న కన్నీటిని తన భుజం మీద కండువాతో తుడుస్తూ అన్నాడు.

"తల్లీ. నీకామాత్రం ఆత్మవిశ్వాసం, ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలనన్న మనోనిబ్బరం వుండాలేగాని.. నీకోసం మనవడి కోసం.. నేను ఎంతైనా చేస్తాను తల్లీ!'.. లలిత ఆనందంగా తండ్రి చేతులు పట్టుకుని కళ్లకి అద్దుకుంది.

నాన్నా! నా దగ్గర ఇంకా కొంచెం బంగారం ఉంది. అది అమ్మి అయినా సరే. డబ్బు ఖర్చుపెట్టి నాకు ఎక్కడైనా ఒక చిన్న ఉద్యోగం..

రామకృష్ణయ్య మందలిస్తున్నట్లు అన్నాడు.

నువ్వు చెయ్యాలేగానీ ఉద్యోగం సిద్ధంగా ఉంది తల్లీ.

నా..న్నా?

రామకృష్ణయ్య చిరునవ్వు నవ్వాడు.

"అవును తల్లీ. నేను వాలంటరీ రిటైర్‌మెంట్ అవుతున్నాను కదా? ఉద్యోగస్తుల పిల్లల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చే పద్ధతి వుంది. మగపిల్లలిద్దరికి ఆ అవసరం రాలేదు. నాకంటే మంచి భవిష్యత్తుగల ఉద్యోగాలు వాళ్లు తెలివి తేటల్తో సంపాదించుకున్నారు. కాబట్టి ఇప్పుడు నేను రిటైర్ అవుతున్నాను గనక నీకు మా ఆఫీసులో నే ఉద్యోగావకాశం దొరుకుతుంది తల్లీ. మనం ఏ డబ్బు ఖర్చు పెట్టనక్కర్లేదు. నీలో ఆత్మవిశ్వాసం అనే పెట్టుబడి వుంటే చాలు."

''కావల్సినంత ఉంది నాన్నా లలిత కంఠంలోని ఆవేశాన్ని రామకృష్ణయ్య ముచ్చటపడుతున్నట్లు అన్నాడు. అయితే దిగులుపడాల్సిన పనిలేదు తల్లీ. మంచిరోజు చూసి అప్లికేషన్ ఇద్దాం."

లలిత సందేహం పడుతున్నట్లు అంది.

''మరి...అమ్మ?"

"ఆ విషయాన్ని నేను చూసుకుంటాను తల్లీ. ముందు నువ్వు నీ సర్టిఫికెట్లన్నీ ఇలా పట్టుకురా. జిరాక్స్ తీయించుకుని వస్తాను. రేపు ఉదయం మనిద్దరం మా ఆఫీసుకు వెళదాం.." అన్నాడు ఉత్సాహంగా చేతికర్ర అందుకుని చెప్పులు తొడుక్కున్నాడు.

తూనీగలాగ లోపలికి పరిగెత్తి తన సర్టిఫికెట్ల ఫైలు పట్టుకుని తండ్రి చేతికి అందించింది.

అమ్మ వస్తే నేను పనిమీద బజారుకు వెళ్లానని అరగంటలో వస్తానని చెప్పు తల్లీ. అంతకంటే ఇంకేం చెప్పకు సుమా?'' అంటూ వీధిలోకి వచ్చాడు.

నిన్నటి దాకా మసకబారిన కళ్ల అద్దాల్లోంచి అస్తవ్యస్తంగా ఎగుడుదిగుడుగా కనిపించే రోడ్డు ఇప్పుడు ఎందుకో విశాలంగా సుగమంగా అనిపించింది రామకృష్ణయ్యకి.

ఏదో కొత్త శక్తి శరీరంలోకి ప్రవేశించినట్లు అయ్యింది.

ఆ మసక కళ్లద్దాల్ది కాదు. బహుశా నా మనసుదేమో.. అనుకున్నాడు.

చేతికర్ర వూతగా టకటక మనిపిస్తూ ఉత్సాహంతో మెయిన్ బజారు వైపు అడుగులు వేశాడు.

మూగబోయిన కోయిల గొంతు విప్పుతున్నట్లు, చీకటి నిండిన కూతురు జీవితంలో వెలుగురేఖలు ఉదయిస్తున్నట్లు ఏదో ఆనందం.

కనుమరుగుతున్న తండ్రిని చూస్తూ భవిష్యత్తు వూహాలు దిద్దుకోసాగింది లలిత. ○

